నవతెలంగాణ
ఉమ్మడి ఆదిలాబాద్
మంగళవారం | జనవరి 2, 2024 | www.navatelangana.com

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

నవతెలంగాణ-మందమర్రి

ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. సోమవారం మధ్యాహ్నం మందమర్రి ఇల్లందు క్లబ్ ప్రాంతంలో ఎదురుదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కెకె ఓసిలో పని చేస్తున్న సింగరేణి ఉద్యోగి కోటేష్(40) తీవ్రంగా గాయపడ్డాడు. ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన తుంగ మహేష్(25)కు స్వల్ప గాయాలయ్యాయి. వీరిద్దరిని స్థానికుల సమాచారంతో వెంటనే 108 ద్వారా మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. కోటేష్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.



సావిత్రిబాయిపూలే జయంతిని అధికారికంగా నిర్వహించాలి

- మాలీ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి లెన్గురే బాలాజీ

నవతెలంగాణ-కెరమెరి

సావిత్రిబాయిపూలే జయంతిని అధికారికంగా నిర్వహించాలని మాలీ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి లెన్గురే బాలాజీ అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ సావిత్రిబాయిపూలే దేశంలో మహిళా విద్యకు మార్గదర్శకురాలన్నారు. బడుగు బలైన వర్గాల మహిళలకు విద్యను అందించేందుకు కృషి చేసిన గొప్ప దార్శనీకురాలని పేర్కొన్నారు. మహనీయురాలైన సావిత్రిబాయి పూలే జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.



కుప్పలు తెప్పలుగా..!

- పల్లె, పట్టణాల్లో ప్రజా పాలన దరఖాస్తుల సందడి
- జిల్లాలో మూడు రోజుల్లోనే 60,793 వినతులు
- ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మీ పథకానికి అధికం
- ఈ నెల 6వ తేదీ వరకు అవకాశం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న ఆరు గ్యారెంటీ పథకాల కోసం ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోంది. పల్లెలు, పట్టణాల్లో ప్రజాపాలన పేరిట నిర్వహిస్తున్న ఈ సభల్లో దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. కిందటి నెల 28 నుంచి 30వ తేదీ వరకు కేవలం మూడురోజుల్లోనే ఏకంగా 60,793 దరఖాస్తులు వచ్చాయి. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపాలని ప్రజలు స్వచ్ఛందంగా ఈ సభల్లో దరఖాస్తులు అందిస్తున్నారు. తేదీల వారీగా నిర్వహిస్తున్న ఈ సభల కోసం దూర ప్రాంతాల్లో వివిధ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారు సైతం సొంత ప్రాంతానికి వచ్చి దరఖాస్తులు అందించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలకు దరఖాస్తులు అందించేందుకు ఎనిమిది రోజుల వరకు గడువు ఇచ్చింది. ఈ నెల 6వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఉండటంతో వీటి సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశం ఉంటుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. వీటిలో ఎక్కువగా ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మీ పథకం కోసం దరఖాస్తులు వస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కొత్త ప్రభుత్వం కొలువుదీరిన అనతికాలంలోనే ప్రజాపాలన పేరిట సభలు నిర్వహిస్తోంది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని భావిస్తోంది. అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలను తప్పక అమలు చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టింది. ప్రజలు సైతం కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారు. ఈ క్రమంలో ఆరు గ్యారెంటీ పథకాల కోసం దరఖాస్తులను స్వీకరించడం మొదలుపెట్టింది. ఈ పథకాల్లో భాగంగా ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు రాజీవ్‌ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10లక్షలకు వర్తింపజేస్తూ నిర్ణయం తీసుకుంది. మిగిలిన పథకాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. తొలి రోజున రేషన్‌కార్డులు లేని వారు కొంత అయోమయానికి గురైనా ఉన్నతాధికారులు ఆయా సమస్యలను నివృత్తి చేస్తూ రేషన్‌కార్డు లేని వారు దరఖాస్తులు చేసేందుకు అవకాశం ఉంటుందని చెప్పడంతో అనేక మంది ఆసక్తి కనబరుస్తున్నారు. ముఖ్యంగా మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ప్రతి నెలా రూ.2500 ఆర్థిక సాయం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ సౌకర్యం కల్పించడం, రైతుభరోసా కింద రైతులు, కౌలురైతులకు ఎకరానికి రూ.15వేల ఆర్థిక సాయంతో పాటు వ్యవసాయ కూలీలకు రూ.12వేల చొప్పున అందజేస్తామని చెప్పడంతో వారంతా దరఖాస్తులు చేసుకుంటున్నారు. గృహజ్యోతి కింద 200యూనిట్ల ఉచిత విద్యుత్తు సౌకర్యం, చేయూత పథకం కింద ప్రతి నెలా రూ.4వేల పింఛన్ల కోసం వినతులు వెల్లువెత్తుతున్నాయి. మరోపక్క ప్రభుత్వం ఇది వరకే రైతుబంధు, పింఛన్లు తీసుకున్న వారు దరఖాస్తులు చేసుకోవాల్సిన అవసరం లేదని చెబుతోంది.

ఈ రెండు పథకాలకే అధికం..!

ఆరు గ్యారెంటీల్లో భాగంగా అధికంగా ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మీ పథకాలకే అధికంగా అర్జీలు వస్తున్నట్లు తెలుస్తోంది. మిగితా గ్యాస్ సిలిండర్ తదితర పథకాలకు కూడా దరఖాస్తులు చేస్తున్నా..ఎక్కువ మంది వీటిపైనే దృష్టిసారించారు. గత ప్రభుత్వం పాలించిన తొమ్మిదేండ్లలో ఒకటి రెండు గ్రామాల్లో తప్పితే ఎక్కడా ఇండ్లు మంజూరుచేసిన దాఖలాలు లేవు. అనేక ఉమ్మడి కుటుంబాలు ఇప్పటికీ ఇరుకుగదుల్లో ఉంటూ జీవనం సాగిస్తున్నాయి. పూరిగుడిసెలు, రేకుల షెడ్లు వేసుకొని ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలోనూ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన సందర్భాలు ఉండటంతో ప్రజలు ఈ సర్కారుపై నమ్మకంతో ఉన్నారు. ప్రభుత్వం సైతం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు అందజేస్తామని చెప్పడంతో అనేక మంది నిరుపేదలు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. వీటితో పాటు మహిళలకు ప్రతి నెలా రూ.2500 అందజేస్తామని చెప్పడంతో ప్రతి ఇంటిలో మహిళలు ఈ పథకానికి దరఖాస్తు అందిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో తొలి రోజున 11,595 దరఖాస్తులు రాగా రెండో రోజుకు వీటి సంఖ్య 34,450కి చేరింది. మూడు రోజున ఏకంగా 60,793 దరఖాస్తులు వచ్చాయి. మిగితా మంచిర్యాల, నిర్మల్, కుమురంభీం జిల్లాల్లోనూ ఇదే తరహా పరిస్థితి కనిపిస్తుందని అధికారులు చెబుతున్నారు.

నూతన సంవత్సరంలో అంతా మంచే జరగాలి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



నవతెలంగాణ-దహెగాం

నూతన సంవత్సరంలో అందరికి మంచే జరగాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నూతన సంవత్సరం సందర్భంగా మీడియా ప్రతినిధులతో కలిసి ఆయన కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో అభివృద్ధి సాధించడానికి మీడియా ప్రతినిధులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షుడు ముఖషిర్ పాషా, కోశాధికారిగా ప్రవీణ్, సభ్యులు రాకేష్, సత్యనారాయణతో పాటు బీజేపీ నాయకులు రాపర్తి ధనుంజయ్ పాల్గొన్నారు.

మందమర్రికి మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలి



నవతెలంగాణ-మందమర్రి

మందమర్రికి మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. కొత్త సంవత్సరం సందర్భంగా సోమవారం మందమర్రి టీడీపీ కార్యాలయంలో ప్రజలందరికీ శుభం జరగాలని కోరుకుంటూ సంజయ్‌కుమార్ కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలు చేయకుండా మున్సిపాలిటీ ఎలక్షన్ నిర్వహించి మందమర్రి అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. ఎమ్మెల్యే వివేక్ ఎన్నికలకు కృషి చేయాలన్నారు. నూతన బొగ్గు బావులని ప్రారంభించి ఈ ప్రాంత నిరుద్యోగులకు భవిష్యత్తు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణంలో పెద్ద ఆసుపత్రిని కట్టి నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ షరీఫా, జిల్లా నాయకులు కిష్టయ్య, పట్టణ మహిళా అధ్యక్షురాలు జయ, మండల నాయకులు విజయగిరి శంకర్, పట్టణ ఉపాధ్యక్షుడు కరిడే తిరుపతి, మండల మహిళా అధ్యక్షురాలు సుగుణక్క, పట్టణ ఉపాధ్యక్షురాలు జూపాక సంధ్య, సువర్ణ పాల్గొన్నారు.

ఆటలతో స్నేహబంధాలు పెరుగుతాయి : సర్పంచ్ మడావి రేణుక



నవతెలంగాణ-కౌటాల

ఆటల వల్ల స్నేహభవంతో పాటు ఆరోగ్యం కలుగుతుందని వీర్ధండి సర్పంచ్ మడావి రేణుక అన్నారు. సోమవారం మండలంలోని వీర్ధండి గ్రామంలో గ్రామస్థాయి ఒక్కరోజు వాలీబాల్ క్రీడను ఆమె ప్రారంభించారు. క్రీడాకారులను పరిచాయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. అనతరం ఆమె మాట్లాడుతూ పెందూర్ గజానన్ పోచాని స్మారక గ్రామస్థాయి క్రీడను పెందూర్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇందులో 15 టీంలు పాల్గొనగా గెలుపొందిన టీంకు పెందూర్ రాజు రూ.1500 నగదు అందజేశారు. గ్రామస్థాయిలో యువత చెడు వ్యసనాలకు వెల్లకుండా చదువుపై దృష్టి సారిస్తూ మానసిక ఉల్లాసానికి ఆటల వైపు దృష్టిని కేంద్రికృతం చేయాలన్నారు. గ్రామస్థాయిలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు మార్గదర్శకాలుగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మొగడ్‌దగడ్ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాందేవ్, బీఆర్ఎస్ నాయకులు మధూకర్, కాంగ్రెస్ నాయకులు వంశీ, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడి పూజ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పట్టణంలోని బ్రాహ్మణవాడ కేశవనాథ్ ఆలయంలో ఆదివారం అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. రెబ్బెన మండల కేంద్రానికి చెందిన వేద పండితులు ముసునూరి సూర్య భాస్కర శర్మ, కిరణ్ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. గణపతి సుబ్రహ్మణ్య అయ్యప్ప స్వాముల అష్టోత్తరాలు, అయ్యప్ప స్వామి అభిషేకం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాములు చేసిన పేటతల్లి ఆకట్టుకుంది. అనంతరం పదు నెట్టంబడిపై దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వేద పండితులను శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు నళిని మోహన్, దూడల అశోక్, మడావి శ్రీనివాస్, వెంకట్ గౌడ్, వేణుగోపాల్, బట్టుపల్లి సంతోష్, చంద్రమోహన్, వినాయక్, చిట్టిమల్ల సంతోష్, బాల రాము, రాజబాబు పాల్గొన్నారు.

భీమా కోరేగావ్ అమరుల స్ఫూర్తిని నిలబెట్టాలి

- మంచిర్యాలలో భీమా కోరేగావ్ శౌర్యదివస్




నవతెలంగాణ-హాజీపూర్

దేశంలో అనైక్యతలను సృష్టిస్తున్న మనువాద వ్యవస్థను నిర్మూలించడానికి 206 ఏండ్ల క్రితమే పోరాటం సల్పిన భీమా కోరేగావ్ అమరవీరులు అందించిన చైతన్యంతో కులవ్యవస్థ నిర్మూలనకు దేశ ప్రజలందరూ నడుం బిగించాలని వివిధ బహుజన సామాజిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం జనవరి 1 సందర్భంగా మంచిర్యాలలో 'భీమా కోరేగావ్ అమరవీరుల శౌర్య దివస్'ను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక అమరవీరుల స్థూపం దగ్గర బహుజన వీరులకు నివాళులర్పించారు. నాడు మహారాష్ట్రను నేలుతున్న పీష్వా రాజుల కుల దురహంకారాన్ని ఎదుర్కోవడానికి బహుజన వీరులు 1.1.1818న చేసిన వీరోచిత పోరాటమే భీమా కోరేగావ్ యుద్ధంగా చరిత్రలో నిలిచిపోయిందని వారు తెలిపారు. నాటి బహుజన వీరుల పోరాటం ఆంగ్లేయుల కోసం కాదని ఆత్మాభిమానం, కులనిర్మూలన కోసమేనని పేర్కొన్నారు. భారతదేశం పరాయి ప్రభువుల పాలు కావడానికి సహకరించిన కుల దురహంకారుల దౌర్జన్యాలు నేటికి సైతం కొనసాగుతున్నాయని, వాటిని బహుజనులందరూ ఐక్యంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. దేశంలోని మెజారిటీ వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీల హక్కుల కోసం సామాజిక న్యాయ ఉద్యమకారులు ఐక్యంగా ఉద్యమించాలని, మనువాదానికి మతోన్మాదానికి దేశంలో తావులేదని పేర్కొన్నారు. భీమా కోరేగావ్ పోరాట స్ఫూర్తిని ఆ తర్వాతి కాలంలో కొనసాగించిన మహాత్మా పూలే, బాబాసాహెబ్ అంబేద్కర్ చూపిన తోవలో అందరూ నడవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దళిత - బహుజన ఐక్యవేదిక నాయకులు పలిగిరి కనకరాజు, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర నాయకులు దుర్గం రామ్మూర్తి, బీసీ ఐక్యవేదిక నాయకులు కనుకుంట్ల మల్లయ్య, సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు దేవి సత్యం, ఎస్సీ ఎస్టీ సంఘం జిల్లా అధ్యక్షులు గొడిసెల రాజారాం, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు దేవి పోచయ్య, సామాజిక ఉద్యమ నాయకులు కామిల్ల జయరావు, రిటైర్డ్ ఎస్సై తుకారాం, బహుజన ఉద్యమ నాయకులు తోటపల్లి భూమన్న, జనవిజ్ఞాన వేదిక నాయకులు ఎడ్ల కిష్టయ్య, ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీమన్నారాయణ, దళిత నాయకులు దుర్గం ఎల్లయ్య, యుగంధర్, దశరథం వివిధ దళిత బహుజన ప్రజాస్వామిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎస్పీ, ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నవతెలంగాణ దినపత్రిక 2024 నూతన క్యాలెండర్‌ను సోమవారం ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆవిష్కరించారు. ముందుగా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్యాలెండర్‌ను ఎస్పీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ ఉమ్మడి జిల్లా రీజనల్ మేనేజర్ నాందేవ్, ఉమ్మడి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మెడపట్ల సురేష్, ఆదిలాబాద్ డివిజన్ ఇన్‌చార్జి ఉష్కం సురేష్, సబ్ ఎడిటర్ కొండ రాజన్న, ఆదిలాబాద్ టౌన్ రిపోర్టర్ గాజరి శ్రీకాంత్, రూరల్ రిపోర్టర్ రాజేశ్వర్, జైనథ్ రిపోర్టర్ వెంకట్, సర్క్యులేషన్ ఇన్‌చార్జి వంశీ, ప్రశాంత్ పాల్గొన్నారు.






ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర వెలకట్టలేనిది

- ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడ హేమంత్
- నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ

నవ తెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజాస్వామ్యానికి ఉన్న నాలుగు స్తంభాల్లో పత్రికలు ఒక స్థంభంగా ఉన్నాయని వాటి పాత్ర వెలకట్టలేనిదని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ అన్నారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి, ఎమ్మెల్యే కోవ లక్ష్మి తన నివాసంలో నవతెలంగాణ 2024 సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పత్రికలు ముఖ్య భూమిక పోషించాలన్నారు. పత్రికలు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని హితవు పలికారు. సమాజంలో ఉన్న మంచి చెడులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియడానికి పత్రికలు ప్రధాన పాత్ర వహిస్తాయన్నారు. ఒక గ్రూపుకు మాత్రమే అనుకూలంగా ఉండేలా పత్రికల పని చేయకూడదన్నారు. నేటి ఆధునిక యుగంలో పత్రికలు సమాజంలో మార్పుకు ప్రయత్నించాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు చేసే మంచి చెడులను ప్రజలకు తెలియజేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని అన్నారు. జర్నలిజం అనేది గొప్ప విలువలతో కూడుకున్నదని, ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర వెలకట్టలేనిదన్నారు. సమాజంలో ఉన్న లోటుపాట్లను ప్రజలకు తెలియజేయడానికి పత్రికలు ఉపయోగపడతాయన్నారు. తప్పులు ఎత్తి చూపినప్పుడు సవరించుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలేష్ గౌడ్, చిలువేరు వెంకన్న, ఎత్తేశాం, నవతెలంగాణ రిపోర్టర్ మహేష్, బాలాజీ, యాదగిరి పాల్గొన్నారు.



ఘనంగా శౌర్య దివస్ వేడుకలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సమత సొసైటీ, బుద్ధిస్ట్ సొసైటి ఆఫ్ ఇండియా అధ్వర్యంలో భీమ కోరేగావ్ శౌర్య దివస్ వేడుకలు సోమవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. భీమ కొరెగావ్ యుద్ధంలో పేశ్వలపై వీరోచితంగా పోరాడి అసువులు బాసిన మాహర్ వీరులకు శ్రద్ధాంజలి ఘటించి శౌర్య స్థూపానికి నీలి జోహార్లు అర్పించారు. తతగత్ గౌతమ బుద్ధుడు, బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటాలకు పుష్పాలంకరణ చేసి సామూహికంగా బుద్ధ వందన చేశారు. పుస్తకాలలో రాయబడని చరిత్రను వీరుల త్యాగాలను, పోరాట పటిమను నేటి సమాజానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని సమత సొసైటీ అధ్యక్షులు జనార్ధన్ దుర్గం అన్నారు. త్యాగాల పునాదులపై నిర్మించిన దేశంలో ఉన్న సంపద, న్యాయం ప్రతి ఒక్కరికీ దక్కినపుడు సమసమాజ నిర్మాణం అవుతుందని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేధి చరందాస్ అన్నారు. దేశంలో ఉన్న ప్రజలు బౌద్ధాన్ని అనుసరించి అంబేద్కర్ కలలు కన్న కుల రహిత సమాజ నిర్మాణానికి పాటుపడాలని బుద్ధిష్ట సొసైటి ఆఫ్ ఇండియా జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం విస్తారు అనారు. ఈ కార్యక్రమంలో సమత సొసైటీ ప్రధాన కార్యదర్శి ముడిమాడుగుల తిరుపతి, కార్యకర్తలు డా.టేమజి, గాజానన్ దొంగ్రె, రామ్‌చందర్ దుర్గే, సంతోష్ దేవగాడే, గణపతి కొండగుర్లే, సంతోష్ డోంగ్రె, శ్యామ్‌రావు, శ్రీనివాస్ జాడి, మోహన్ దుర్గం, మారుతి దుర్గం, శ్రీనివాస్ జాడి, రమేష్ డొంగ్రె పాల్గొన్నారు.

వాంకిడి : మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శౌర్య దినోత్సవాన్ని అంబేద్కర్ సంఘం నాయకులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. భీమాకోరేగావ్‌లో అమరులైన సైనికులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం గౌతమ బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు విజయ్, జయరాం, శ్యాంరావు, విలాస్, మహిళా మండలి కార్యకర్తలు పాల్గొన్నారు.

'పదోన్నతితో బాధ్యత మరింత పెరుగుతుంది'



ఆసిఫాబాద్ : పదోన్నతి మరింత బాధ్యతను పెంచుతుందని జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. సివిల్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తూ ఎఎస్సైలుగా పదోన్నతి పొందిన బి.రమేశ్, కె.అనిల్ కుమార్, కె. చంద్ర శేఖర్, ఎ.సాయిబాబా, జమాల్ అహ్మద్, కే.వేణు గోపాల్‌లను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖలో పదోన్నతి ద్వారా స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుందని, పెరిగిన బాధ్యతను క్రమశిక్షణాయుతంగా నిర్వహిస్తూ ప్రజలలో పోలీస్ శాఖ పట్ల నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కష్టపడి పనిచేసి పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రజలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, కష్టపడి పని చేస్తే ఎప్పటికైనా మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
మంగళవారం | జనవరి 02, 2024 | www.navatelangana.com

నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఇటీవల ఎంబడి వంశీ అనే యువకుడిపై హత్యాయత్నం జరిగి గాయపడి చికిత్స పొందుతున్నట్టు తెలుసుకున్న ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్, మాదిగ జాగృతి సంఘం జిల్లా కన్వీనర్ నాతరి రమేష్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, దళితబిడ్డ అనే వివక్ష కారణంగానే వంశీని అరాచకంగా వాహనంతో ఢీకొట్టి



హత్య యత్నం చేశారని అన్నారు. వెంటనే రఘుపతిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠినంగా శిక్షించాలని అన్నారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో మాదిగ జాగృతి సంఘం జిల్లా కో కన్వీనర్‌లు అన్నెల అడెల్లు, డా.బొమ్మెన రవికాంత్, ఎల్మాల నగేష్ దళిత సంఘాల నాయకులు ఉన్నారు.

సహా తైక్వాండో ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని సహా తైక్వాండో ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని విద్యానగర్ కాలనిలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా రోజువారి ప్రాక్టీస్ నిర్వహించిన అనంతరం విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసుకొని ఒకరినొకరు తినిపించుకొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సహా తైక్వాండో క్లబ్ అధ్యక్షులు మాస్టర్ వీరేష్, కోచ్‌లు మాధవి, రాథోడ్ వనిత, అజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.



విధుల పట్ల అంకిత భావంతో పనిచేయాలి

- జిల్లా ప్రజలకు ఎస్పీ శుభాకాంక్షలు
- కేక్ కట్ చేసి సంబరాలు



కేక్ కట్ చేస్తున్న జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి, పోలీసు అధికారులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

2024 సంవత్సరం నూతన ఆలోచనలు, సమిష్టి కృషి, సిబ్బంది విధుల పట్ల అంకిత భావంతో పనిచేస్తూ జిల్లా పోలీసు కీర్తిని మరింత పెంపొందించే విధంగా పకడ్బందీ ప్రణాళికతో శాంతిభద్రతలను పరిరక్షిస్తామని జిల్లా ఎస్పీ డి ఉదయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆంగ్ల నూతన సంవత్సరం వేడుకలను జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో, స్థానిక పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, ఇతర శాఖల ఉన్నతాధికారులు జిల్లా ఎస్పీని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి పూల మొక్కతో ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మొదటగా జిల్లా ప్రజలకు 2024 ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. క్యాంపు కార్యాలయం మొదటగా ఆదిలాబాద్, ఉట్నూర్ సబ్ డివిజనల్ పోలీస్ ఉన్నతాధికారులు, సీఐలు, ఎస్సైల సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అదేవిధంగా స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిజర్వ్ సిబ్బంది సమక్షంలో కేక్ కట్ చేసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. గత సంవత్సరం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగించడానికి జిల్లా పోలీసులు సమిష్టిగా, ఏకాభిప్రాయంతో ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ చేసిన పనితనం అనిర్వచనీయమైనదని కొనియాడారు. సిబ్బంది ఎల్లవేళలా తమ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ విధులను కొనసాగించాలని సూచించారు. రానున్న ఎన్నికలను అదేవిధంగా పూర్తి చేయాలని సిబ్బందికి తెలియజేశారు. 2024 సంవత్సరంలో ముఖ్యంగా మత్తుపదార్థాలను జిల్లాలో పూర్తిగా రూపుమాపాలని, సైబర్ క్రైమ్‌పై జరుగుతున్న నేరాలను, వారు ఆచరిస్తున్న నూతన పద్ధతులను ప్రజలకు అవగాహనను కల్పిస్తూ, సైబర్ క్రైమ్ బాధితుల తక్షణ సహాయంపై తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాలని తెలియజేశారు. అలాగే రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో జిల్లా పోలీసులు తీసుకుంటున్న చర్యలను నిరంతరం కొనసాగిస్తూ ఈ సంవత్సరం ప్రమాదాల సంఖ్య తగ్గించడమే లక్ష్యంగా సిబ్బంది విధులను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు వి ఉమేందర్, సీహెచ్ నాగేందర్, సీఐలు కే.సత్యనారాయణ, అశోక్, ఐ సైదారావు, ప్రేమ్ కుమార్, కే నరేష్, ఐ.భీమేష్, చంద్రశేఖర్, రామకృష్ణ, రవీందర్, డి.సాయినాథ్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు టి.మురళి, నవీన్, స్వామి, సీసీ దుర్గం శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై అన్వర్ ఉల్ హక్, రిజర్వ్ సిబ్బంది, ఎస్సైలు, డీసీఆర్బీ, ఐటీ కోర్, ఫింగర్ ప్రింట్ అధికారులు పాల్గొన్నారు.



పోలీసు అధికారులకు పలు సూచనలు చేస్తున్న ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి

నూతన సంవత్సర వేళ కవి సమ్మేళనం



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆదిలాబాద్ ఐత్వారం ముచ్చటలో భాగంగా పట్టణానికి చెందిన ప్రముఖ కవి డా.ఉదారి నారాయణ నివాసంలో నూతన సంవత్సర కవిసమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సందర్భానికి తగ్గట్టుగా నూతన సంవత్సర శోభలో అందరి జీవితాలు విరబూయాలని కవులు కాంక్షించారు. కార్యక్రమంలో ఐత్వారం ముచ్చట్లు కవులు, కవయిత్రిలు బాబన్న, గంగన్న, వీరన్న, త్రివేణి, ఆకీరా, నిమ్మల ప్రశాంత్, రిజ్వాన్, శైలజ, సాయిప్రియ, విజయ, ఇందిరా పాల్గొన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఉట్నూర్

2023 సంవత్సరానికి విడ్కోలు పలుకుతూ 2024కు స్వాతగం పలుకుతు ప్రజలకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరు సఖసంతోషాలతో ఉండాలని, ప్రభుత్వ పథకాలు అర్హులకు అందించేల అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. ఈ సంవత్సరంలో అందరికి మంచిగాలని ఆకాంక్షించారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

నవతెలంగాణ-నార్నూర్

ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలను యువత, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. పాత సంవత్సరానికి విడ్కోలు పలికి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. సోమవారం మండలంలోని జామడ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థినులతో కలిసి కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఆయా గ్రామాల్లో యువత కేక్‌కట్ చేసి నూతన నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఇదిలా ఉంటే అటూ ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీసులు ముందుగా సూచనలు చేశారు.

ఘనంగా భీమా కోరేగావ్ విజయ దివస్

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని భోపాపూర్ గ్రామంలో సోమవారం భీమా కోరేగావ్ విజయోత్సవ దినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కనక సేవంత ప్రభాకర్ భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అప్పటి యుద్ధంలో అసువులు బాసిన 500 మంది మహర్ వీరుల సేవలను గుర్తు చేస్తూ వారికి ఘన నవాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు బామ్నే రాజు, విద్వాన్, దుత్‌రాజ్ మధుకర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళితుల ఆధ్వర్యంలో భీమా కోరేగావ్ శౌర్య దివస్‌ను జరుపుకున్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కొరెగావ్ పోరాటాన్ని పాఠ్యాంశంలో పొందుపరిచాలని డిమాండ్ చేశారు. దళితులు చేసిన పోరాటం భావి తరాలకు అందుతుందని పేర్కొన్నారు. అనంతరం కవ్వాలి, కచేరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లహుదాస్, మనోహర్, శివాజీ, వెంకట్ రావ్, ఉత్తం పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీపై ప్రజా వేదిక

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలో 1 ఏప్రిల్ 2022 నుంచి 31 మార్చి 2023 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై మంగళవారం ప్రజావేదిక నిర్వహిస్తున్నట్టు ఆ శాఖ ఏపీఓ జాదవ్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం రూ.7.16 కోట్ల పనులపై ఇటీవలే సామాజిక తనిఖీ బృందం గ్రామసభలు నిర్వహించిందన్నారు. మంగళవారం ఉన్నతాధికారుల సమక్షంలో ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గోండ్వనా యువశక్తి జై మహంకాళి యూత్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

గోండ్వనా యువశక్తి జై మహంకాళి యూత్ నూతన కమిటీ సోమవారం ఎన్నుకున్నారు. ఆదిలబాద్ రూరల్ మండలంలోని పందిరిలోద్ది గ్రామంలో గొండ్వనా యువశక్తి జై మహంకాళి యూత్ నూతన కమిటీని ఎన్నుకోడం జరిగింది. అధ్యక్షులు ఎర్మ జంగుబాపు, ఉపాధ్యక్షులుగా ఉయిక తుకారాం, ప్రధాన కార్యదర్శి తోడసం భీమ్‌రావు, కోశాధికారి కుమ్ర మంతు, గితచారి సిడం సాయికుమార్, ఐదు గురు నాయకులతో కమిటీ ఏకగ్రీవంగా ఎనుకోవడం జరిగిందన్నారు .యువత 2024 సంవత్సరంలో అనుకున్న లాక్షలను సాధన కొరకు కృషి చేయాలని ఎలాటి మత్తు పదార్థాలకు బానిస కాకూడదని సూచించారు.

నూతన లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నూతన లక్ష్యాలను నిర్దేశించుకుని పోలీసులు పనిచేయాలని ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో కలిసి కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన సంవత్సరం పోలీసు శాఖలో ఎన్నో నూతన ఒడవడికలను, ఆధునాతన సాంకేతికతను అందించడమే కాకుండా సిబ్బంది పూర్తి స్థాయి విధి నిర్వహణకు ఎంతో దోహద పడిందన్నారు. బేసిక్ పోలీసింగ్ విధానాన్ని అవలంబిస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలన్నారు. ఈ నూతన సంవత్సరంలో కూడా అదేశైలిలో అధికారులు, సిబ్బంది వ్యక్తిగత, వృత్తిపరంగా నూతన లక్ష్యాలను నిర్దేశించుకుని పని చేయాలన్నారు. తరచూ ఒత్తిడితో కూడిన పరిస్థితుల్లో చేసే పనితో పాటు ఆరోగ్య విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా రాబోవు ఎన్నికలకు అధికారులు, సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, డీసీఆర్బీ డీఎస్పీలు ఎం.వెంకట రమణ, కరుణాకర్, రమేశ్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఘనంగా రాములోరి అక్షింతల శోభాయాత్ర

నవతెలంగాణ-దిలావర్‌పూర్

అయోధ్యలో పూజించిన శ్రీ రాములోరి అక్షింతలు సోమవారం మండల కేంద్రానికి చేరుకున్నాయి. హిందూ వాహిని ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, నాయకులు శోభాయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. పల్లకిలో శ్రీరాముడి చిత్రపటంతో, భజన గీతాలతో ఊరేగింపుగా బయలుదేరి శ్రీ రామ మందిరానికి చేరుకున్నారు. దిలావర్‌పూర్ గ్రామమంతా శ్రీరామ కీర్తనలు మారుమోగింది. శ్రీ రామ మందిరంలో దేగామ శంకర్ శర్మ, సఖరాం శర్మ, సంజయ్ శర్మ, నరేష్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దొడ్డికింది గంగవ్వ ముత్యం రెడ్డి, సర్పంచ్ విరేష్, ఉపసర్పంచ్ సామ రాజేశ్వర్‌రెడ్డి, వీడీసీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

హత్యాయత్నంలో గాయపడ్డ బాధితుడికి పరామర్శ



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

హత్యాయత్నంలో కేసులో గాయపడిన యువకున్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న సోమవారం పరామర్శించారు. మావల మండలంలోని మావలలో కౌన్సిలర్ రఘుపతి రోడ్డు ప్రమాదం చేసి, హత్య చేసేందుకు యత్నించగా, ప్రమాదంలో గాయపడిన వంశీ అనే యువకుని ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రహ్లాద్, నారాయణ, నల్ల రాజేశ్వర్, సుధీర్, సంతోష్ అజీంఖాన్, మోసిన్, సృజన్ ఉన్నారు.

కంది శ్రీనివాస్‌రెడ్డి కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



నూతన సంవత్సర వేడుకలు జిల్లావ్యాప్తంగా అంబరాన్నంటాయి. న్యూ ఇయర్ వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని కంది శ్రీనివాస్‌రెడ్డి ప్రజా సేవా భవన్‌లో సందడి నెలకొంది. కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డిని పలువురు మర్యాద పూర్వకంగా కలిశారు. పూలబోకేలు అందజేసి నూతన సంవత్సర శుభకాంక్షలు తెలియజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాసరెడ్డి వారందరీ సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కేక్ తినిపించి కొత్త సంవత్సరం వేళ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు కలెక్టర్ శుభాకాంక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సోమవారం జిల్లా ప్రజలకు 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్‌ను పలువురు అదికారులు, ప్రజాప్రతినిధులు, ఆయా సంఘాల నాయకులు కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి నూతన సంవత్సర శుభాకంక్షలు తెలిపారు. అదేవిధంగా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, అదనపు కలెక్టర్ శ్యామల దేవి, ఎమ్మెల్యే పాయల శంకర్, క్యాంపు కార్యాలయ సిబ్బంది కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా క్యాంప్ కార్యాలయ సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం సంక్షేమ పథకాలు ప్రజలందరికి అందేలా చర్యలు తీసుకుంటూ, పారదర్శకంగా అందిస్తామన్నారు. అధికారులు ఆ దిశగా కృషి చేయాలని కోరారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సెంట్రల్ వేర్ హౌజింగ్ కార్పోరేషన్‌లలోని హమాలీల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ డిమాండ్ చేశారు. హమాలీలు ఏఐటీయూసీలో చేరిన తరువాత సీడబ్ల్యూసీ వద్ద ఏర్పాటు చేసిన జెండాను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హమాలీలకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అతిథులను హమాలీలు శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ విలాస్ మాట్లాడుతూ సీడబ్ల్యూసీలో పని చేస్తున్న కార్మికులకు అనేక సమస్యలున్నాయన్నారు. వాటి పరిష్కారం కోసం ఏఐటీయూసీ ఉద్యమిస్తుందన్నారు. హమాలీలకు సంక్షేమ చట్టం, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత, హమాలీల రేట్ల పెంపును తదితర వాటిని అమలు చేయాలన్నారు. జాతీయ సంఘంగా ఉన్న ఏఐటీయూసీ వల్లనే హమాలీల సమస్యలను సాధిస్తామన్నారు. ఐక్యంగా ఉంటూ హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్, ప్రధాన కార్యదర్శి చౌహన్, ఉపాధ్యక్షుడు సాంబాజి, సహాయ కార్యదర్శి గోపాల్, అబ్దుల్ కలాం, ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కుంటాల రాములు, ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక దేవిదాస్ పాల్గొన్నారు.

రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం ఎమ్మెల్యే పాయల శంకర్‌కు తెలంగాణ రాజీవ్ ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు వినతిపత్రాన్ని అందజేశారు. 2024 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యేకు పూలమొక్కను అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం, ఆయుష్మాన్ భారత్ పథకంలో తామంతా ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రుల్లో సుమారు 1400 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నామని అన్నారు. గత 15 సంవత్సరాలుగా అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నామని తెలిపారు. పేదప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న వేతనాలు చాలా తక్కువగా ఉన్నాయని అన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయాని అన్నారు. కాని తమ వేతనాలు పెరగడం లేవని అన్నారు. ఆరోగ్యమిత్రలకు కనీస వేతనం రూ.28వేలు, ఆఫీస్ అసోసియేట్, టీం లీడర్స్‌కు కనీసవేతనం రూ.35వేలు, జిల్లా మేనేజర్‌కు కనీస వేతనం రూ.45వేలతో పాటు టీఏ, డీఏ సౌకర్యం కల్పించాలని కోరారు. అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి ట్రస్ట్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆరోగ్యశ్రీ సిబ్బంది. విశ్వనాథ్, వ్యాస్, రవీందర్, ఉల్లాస్, భీంరావు ఉన్నారు.



ఎమ్మెల్యేకు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగులు

మహనీయుల జీవిత చరిత్రను భావితరాలకు తెలియజేయాలి



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, దళిత సంఘాల నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

మహనీయుల జీవిత చరిత్రలను భావితరాలకు తెలియజేసి, వారి ఆశయ సాధనకు పాటుపడాలని మాజీమంత్రి జోగు రామన్న సూచించారు. సోమవారం జిల్లాకేంద్రంలోని బుద్ధ విహార్‌లో నిర్వహించిన భీమా కోరేగావ్ శౌర్య దివస్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 1818లో జరిగిన యుద్ధంలో అమరులైన వీరులకు ఘనంగా నివాళ్ళు అర్పించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బౌద్ధుడి చిత్రపటాలకు పూల మాలలు వేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ భీమా కోరేగావ్ యుద్ధంలో అసువులు బాసిన అమరుల త్యాగాలు వెలకట్టలేనివని అన్నారు. మహనీయుల ఆశయ స్ఫూర్తిని భావితరాలకు తెలియజేసి, సమాజ అభ్యున్నతికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో నేతకాని మహర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు దుర్గం శేఖర్, ఎంపీపీ గంద్రత్ రమేష్, మెట్టు ప్రహ్లాద్‌తో పాటు వివిధ దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీలను కలిసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్‌ను, ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డిని సోమవారం వారి వారి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాయల శంకర్ పుష్పగుచ్ఛాన్ని అందించి, 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే పాయల శంకర్ నివాసానికి పలువురు ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, వచ్చి కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి, 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ టీఎస్ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2023కు విడ్కోలు పలుకుతూ 2024లో అడుగు పెట్టామన్నారు. అధికారులు, ప్రజాలు, ప్రజాప్రతినిధుల సమిష్టి కృషితో ఈ సంవత్సరంలో నియోజకవర్గంతో పాటు పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకుంటామని స్పష్టం చేశారు. అదే విధంగా నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వం రైతులు, ప్రజల సంక్షేమం కోసం పని చేయాలని కోరారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
మంగళవారం | జనవరి 02, 2024 | www.navatelangana.com

నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం



మండలం దేవునిగూడ గ్రామ ట్రాక్టర్స్ డ్రైవర్స్ అసోసియేషన్ గ్రామకమిటీని నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా కందుల వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా చాట్ల నరేష్, ప్రధాన కార్యదర్శిగా గొర్రె నరేష్, కోశాధికారిగా గడ్డి జగన్, ప్రచార కార్యదర్శిగా భీమరాజు, సలహాదారులుగా బానేష్ నాగరాజు, శాంతి రాకేష్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ట్రాక్టర్స్ ఓనర్స్ డ్రైవర్స్, కార్మికులకు అందుబాటులో ఉంటూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు. కమిటీకి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

వెంకటాపూర్‌లో వాలీబాల్ పోటీలు

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతీలో సోమవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని వెంకటాపూర్ సర్పంచ్ ఆడె సౌందర్య శంకర్ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ముందుగా సర్పంచ్ పోటీలను ప్రారంభించగా వాలీబాల్ టోర్నమెంట్‌లో మొత్తం ఏడు జట్లు పాల్గొనగా వెంకటాపూర్ జట్టు మొదటి స్థానంలో నిలిచింది. లక్ష్మీపూర్ జట్టు రెండో స్థానంలో నిలిచింది. గెలుపొందిన జట్లకు సర్పంచ్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. యువకులు క్రీడల్లో రాణించాలని, వారికి క్రీడల్లో ప్రోత్సహించడంలో భాగంగా వాలీబాల్ పోటీలు నిర్వహించడం జరిగిందని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కుంరం భీంరావు, మెస్రం శ్రీనివాస్, ఆడె కృష్ణ, సోయం మెగారావు, జంగు పాల్గొన్నారు.

పర్యాటకం.. ప్రగతికి సోపానం

- మంచిర్యాల నియోజకవర్గంలో వనరులు పుష్కలం
- గత పాలకుల నిర్లక్ష్యం
- విశాలమైన గోదావరి తీరం
- దృష్టి సారిస్తే ఉపాధి, భారీగా ఆదాయం

దక్షిణాన మంచిర్యాల నియోజకవర్గం పొడవునా గోదావరి నది తీరాం.. గుడిపేట్ వద్ద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిర్మాణం.. విశాల అటవీ ప్రాంతం ఉన్న నియోజకవర్గాన్ని పర్యాటకంగా అభివద్ధి చేయడానికి పుష్కలంగా అవకాశాలు ఉన్నాయి. జాతీయ రహదారులు, ప్రాచీన ఆలయాలు, చారిత్రాత్మకమైన ప్రాంతాలు, రిజర్వాయర్లు, ఎత్తైన గుట్టలు అభివృద్ధికి ఎదురుచూస్తున్నాయి. పర్యాటకంగా అభివృద్ధికి అవకాశాలు ఉన్నా.. గత పాలకులు ఆ దిశగా ఆలోచన చేయలేదు. కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే, అధికారులు దృష్టి సారిస్తే నియోజకవర్గం పర్యాటకంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి.





నవతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాల నియోజకవర్గంలో పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు పుష్కల వనరులు వున్నాయి. ఇందులో ప్రధానంగా హాజీపూర్ మండలం గుడిపేట్‌లో గోదావరి నది వద్ద నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టులో బోటింగ్ ఏర్పాటు హామీని గత పాలకులు విస్మరించారు. ఇక్కడ బోటింగ్ ఏర్పాటు చేసి 20 కిలోమీటర్ల పొడవు దండేపల్లి మండలం గూడెం వరకు బోటింగ్ ఏర్పాటు చేసే వనరులు వున్నాయి. బోటింగ్ ఏర్పాటు ద్వారా పర్యాటకంగా అభివృద్ధి చెందడంతో పాటు కొందరికి ఉపాధి కూడా లభించే అవకాశాలు ఉన్నాయి. ప్రాజెక్ట్ కింద గతంలో 5 ఎకరాల్లో పార్క్ ఏర్పాటు చేశారు. నిర్వహణ లేకపోవడంతో ప్రస్తుతం తుమ్మలు మొలిచి పార్క్ ఆనవాళ్లు కోల్పోయింది. ప్రాజెక్ట్ కోసం భూసేకరణ చేసిన సందర్భంలో 25 ఎకరాల వరకు మిగులు స్థలం ఉంది. అందులో గత కలెక్టర్ గోదాములు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు సేకరించేందుకు సర్వే నిర్వహించారు. అది అక్కడికి ఆగిపోయింది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌కు రోడ్డు సౌకర్యం సరిగ్గా లేదు. కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణం మధ్యలో ఆపేశారు. ప్రాజెక్ట్ కట్టపై విద్యుత్ లైట్ల ఏర్పాటు అలంకార ప్రయంగానే మిగిలింది. ఎన్నడూ లైట్లు ఎలిగింది లేదు. ప్రస్తుత ఎమ్మెల్యే గత పాలకుల లాగా కాకుండా ఒక విజన్‌తో పనిచేస్తారని పేరుంది. జిల్లా కేంద్రానికి కేవలం 8 కిలోమీటర్ల దూరంలో వుండడంతో సెలవు రోజుల్లో పర్యాటకుల తాకిడి బాగానేఉంటుంది. అభివృద్ధి చేస్తే ఇంకా పర్యాటకులు పెరిగే అవకాశం వుంది. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు ఎల్లంపల్లిపై ప్రత్యేక ప్రణాళికతో ముందుకు పోతారని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

చారిత్రాత్మక ప్రాంతాలు, పార్కులు

నియోజకవర్గంలో పలు చారిత్రక ప్రాంతాలు ఉన్నాయి. దండేపల్లి మండలం పెద్దయ్య గుట్ట, పాండవులగుట్ట, కవ్వాల్ అభయారణ్యం, గూడెం గుట్ట, లక్షెట్టిపేట్ మండలంలోని చిన్నయ్య దేవుడు, హాజిపుర్ మండలంలో బుగ్గగట్టు, దానిని ఆనుకొని వున్న చిత్తరయ్యా గుడి, ఘడ్పూర్ గ్రామం పరిధిలోని ఎంసీసీ క్వారీలు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా జిల్లా కేంద్రానికి దగ్గరలో వున్న క్వారీ పార్క్ గతంలో పర్యాటకులతో కిక్కిరిసి పోయేది. ఎంసీసీ యాజమాన్యం సిమెంట్ కంపెనీ మూసివేయడంతో గత ఎమ్మెల్యే పట్టించుకోక పోవడంతో పార్క్ నిర్వహణ లోపించి పర్యాటకుల తాకిడి తగ్గింది. సరైన సదుపాయాలు కలిపిస్తే పర్యాటకులు పెరిగే అవకాశం ఉంది. ఇక్కడ కొలువై వున్న దుర్గామాత ఆలయంలో భక్తులు వాహన పూజలు చేయడం ఆనవాయితీ. ప్రతి అషాడమాసంలో పెద్ద ఎత్తున ఇక్కడ జాతర ఏర్పాటు చేస్తారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షల్లో భక్తులు వస్తారు. ఘడ్పూర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతరకు నిధులు సరిపోక సదుపాయాలు కల్పించలేకపోతున్నారు. క్వారీ పార్క్‌లో అర కిలోమీటర్ వరకు నీటి కొలను ఉంది. ఇక్కడ బోటింగ్ ఏర్పాటు చేసి, పార్క్‌ను అభివృద్ధి చేస్తే నిత్యం వేలల్లో పర్యాటకులు వస్తారు.



పేదలకు అన్ని విధాలుగా అండగా ఉంటాం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-జన్నారం

పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన, గుండా భూమయ్య అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులో చికిత్స పొందుతున్నారు. వైద్య ఖర్చులు రూ.లక్షల్లో అవడంతో ఆ విషయాన్ని వారి కుటుంబ సభ్యులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.2.50 లక్షలు మంజూరు చేయించి, భాదిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని పేదలకు వైద్యం చేయించడానికి ప్రభుత్వం ముందుంటుందని, ఎవరు అధైర్య పడొద్దన్నారు. 10లక్షల వరకు ఆరోగ్యశ్రీ పథకం కింద అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని అన్నారు. ఈ సందర్భంగా భూమయ్య కుటుంబ సభ్యులు ఖానాపూర్ ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గ్రామ పంచాయితీలో భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వంచే అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ్, అన్నయోజన, దీన్ దయాళ్, అంత్యోదయ యోజన, ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, జీవన జ్యోతి భీమా ఇతర పథకాలపై సంభందిత శాఖల అధికారులు ప్రజలకు వివరించారు. అనంతరం అందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జన్నారం మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ జాడి గంగాధర్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు తపాలాపూర్ శాఖ ఫీల్డ్ అధికారి సతీష్, గ్రామస్తులు యుగంధర్, సత్యం, ఆనందం, ప్రదీప్, రజిత, నరసయ్య, హెల్త్ అసిస్టెంట్ కమలాకర్ పాల్గొన్నారు.

ఉత్సాహంతో పని చేసి సంస్థ ప్రగతికి దోహదపడాలి

నవతెలంగాణ-మందమర్రి

ఉద్యోగులందరూ కొత్త ఉత్సాహంతో పని చేసి సంస్థ ప్రగతికి దోహద పడాలని ఏరియా జీఎం మనోహర్ ఆకాంక్షించారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని మందమర్రి ఏరియా జీఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఉన్నతాధికారులకు సిబ్బందికి ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో ఉద్యోగులందరూ కొత్త ఉత్సాహంతో మరింత ఎక్కువ కృషిచేసి సంస్థ ప్రగతికి దోహద పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం రాజేశ్వర్ రెడ్డి, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, డీజీఎం ఐడి రాజన్న, ఫారెస్ట్ మేనేజర్ రమణారెడ్డి, ఏరియా సర్వే ఆఫీసర్ బందోపాధ్యాయ, ఎస్టేట్ ఆఫీసర్ కుమారస్వామి పాల్గొన్నారు.

'భీమా కోరేగాం విజయం ఎంతో ఉన్నతమైనది'

నవతెలంగాణ-ఆసిఫాబాద్

భీమా కోరేగావ్ విజయం ఎంతో ఉన్నతమైనదని జై బీమ్‌సేన కమిటీ అధ్యక్షుడు జాడి వినోద్ అన్నారు జిల్లా కేంద్రాల్లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట జై భీమ్‌సేన కమిటీ ఆధ్వర్యంలో భీమా కోరేగావ్ శౌర్య దివస్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రలో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి మహారాష్ట్ర పీష్వా వర్గానికి జరిగిన గొప్ప యుద్ధం భీమ కోరేగావ్ అని అన్నారు. భారత సేనల బలం ఈస్ట్ ఇండియా కంపెనీకి తెలిసిందని అన్నారు. ఆ విజయం నేటికీ భారత బలాన్ని చాటుతుందన్నారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి సుధాకర్, గౌరవ అధ్యక్షులు జాడి అశోక్, చరణ్ మసాడే, కోశాధికారి అనీల్ దుర్గే, కృష్ణజీ జాడే, దీక్ష భూమి అధ్యక్షులు మనోహర్ ముంజం, శ్రీకాంత్ జాడి, రవి జాడే, సాంబయ్య ముంజం, ప్రశాంత్ చునార్కర్, ఆకాష్ దుర్గం, నవీన్ దుర్గం, వెంకటేష్ దుర్గం, పెంటయ్య చంద్రి, గౌతమ్ కట్కార్, వసంత్ జాడి, వినేష్ ఉగ్రే టీచర్, శ్యాంరావు దుర్గే, భీంరావ్ కట్కార్, భరత్ జాడి, యస్వంత్ రావు దుర్గే పుల్లయ్య కాంబ్లె పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా వ్యాప్తంగా 2024 నూతన సంవత్సరాన్ని ఉత్సాహంగా స్వాగతించారు. అర్ధరాత్రి 12 గంటలకు ప్రజలంతా పరస్పరం నూనత సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. యువకులు టపాసులు పేలుస్తూ 2024కు స్వాగతం తెలుపుతూ కేరింతలు కొట్టారు. సోమవారం కేంద్రంలోని కలెక్టర్ బోర్కడ హేమంత్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జెడ్పీటీసీ నాగేశ్వరరావుతో పాటు ప్రముఖుల ఇండ్లకు నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు చేరుకొని శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ దాసరి వేణు, కలెక్టరేట్ ఏఓ రఫత్ హుస్సేన్, తహసీల్దార్ బౌమిక్, అధికారులు కలెక్టర్ హేమంత్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కోలాహలంగా ఎమ్మెల్యే నివాసం..

నూతన సంవత్సర సందర్భంగా నియోజకవర్గంలోని ఆయా మండలాల నాయకులు ప్రజలు ఎమ్మెల్యే కోవ లక్ష్మీను కలవడానికి రావడంతో ఉదయం నుండి ఎమ్మెల్యే నివాసం కోలాహలంగా మారింది. ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలుపుతూ ఎమ్మెల్యే వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడంతో పాటు నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆమెను పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, వైస్ ఎంపీపీ సుంకరి మంగా పెంటయ్య, సర్పంచ్ భీమేష్, నాయకులు అబ్దుల్లా, బాలేష్ గౌడ్, వెంకన్న, ఎత్తేశాం పాల్గొన్నారు.

భీమా కోరేగాం అమరవీరుల విజయ దివస్

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం భీమా కోరేగావ్ విజయ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేద్కర్ యువజన సంఘం మండల కన్వీనర్ జాడి పోశం సంఘ నాయకులు బీమా కోరేగాం అమరవీరుల స్మారక స్తూప చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్ల అర్పించారు. ఈ సందర్భంగా బీమా కోరేగాం అమరవీరుల జీవిత చరిత్ర గురించి తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంట సత్యం మాట్లాడుతూ మహార్ వీరుల పోరాట చరిత్రను బహుజన వర్గాలమంత తెలుసు కోవాలన్నారు. వారి పోరాట స్పూర్తితో బహుజన వర్గాలు తమ హక్కుల కోసం పోరాడాలన్నారు. సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు పల్లె మల్లయ్య మాట్లాడుతూ మహార్ పోరాట వీరుల చరిత్ర 1921లో బాబాసాహెబ్ అంబేద్కర్ బాహ్య ప్రపంచానికి తెలియజేశాడన్నారు. బీమా కోరేగావ్ విజయ స్తూపాన్ని సందర్శించి ఈ దేశ బహుజన వర్గం అంతా ప్రతి ఏట విజయ దివాస్ జరుపుకోవాలని పిలుపునిచ్చారన్నారు. సామాజిక చైతన్య వేదిక ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు మాట్లాడుతూ అంటరాని కులాలకు చెందిన మహావీరులు 500 మంది వేలాది బ్రాహ్మణ పీస్వ సైన్యాన్ని ఓడించడం ఎంతో గర్వకారణం అన్నారు. అంబేద్కర్ సంఘం మండల నాయకుడు దాసరి రాజన్న మాట్లాడుతూ భీమా కోరేగాం అమరవీరుల విజయ దివాసి జరుపుకోకుండ బహుజన వర్గాలు నూతన సంవత్సర సందర్భంగా మందు విందులతో జల్సాలు చేయడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోనెల శ్రీనివాస్, సీపీఐ మండల నాయకుడు పులి శంకర్, అంబేద్కర్ సంఘం మండల నాయకులు లంక లక్ష్మణ్, దాసరి రామచందర్, భవన కార్మిక సంఘం మండల నాయకులు ఉప్పులేటి మధునయ్య, కురుమ నరసయ్య పాల్గొన్నారు.



అమరవీరుల స్మారక స్థూప చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న నాయకులు



నస్పూర్‌లో నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

నస్పూర్ : మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శౌర్య దివాస్‌ను సోమవారం సీసీసీ నస్పూర్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు దాసరి వెంకటరమణ, దిలీప్, యుగంధర్ సాయి, మల్లేష్, కిష్టయ్య, దుర్గం రఘునాథ్ పాల్గొని మాట్లాడారు. జనవరి 1వ తేదీ 1818లో కోరేగావ్ గ్రామంలో (పూణాకు 30 కి.మి) భీమా నది ఒడ్డున, 28,000 మంది పీష్వా సైన్యనికి, 500 మంది మహర్ సైనికులకు జరిగిన యుద్ధంలో విజయం సాధించిన సందర్భంగా జనవరి ఒకటిని శౌర్య దినోత్సవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ యుద్ధంలో మరణించినటువంటి మహర్ యుద్ధ వీరులకు నివాళులర్పించడం కోసం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 1927 న తన పిలుపుమేరకు జనవరి 1 తేదీన పూణేలోని భీమా కోరేగావ్ అమరవీరుల స్థూపం దగ్గర నివాళ్లు అర్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. అప్పటినుండి జనవరి 01ని శౌర్య దివస్‌గా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా సీసీసీలోని అంబేద్కర్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళుఅర్పించారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోశిక మనోజ్ కుమార్, ముఖ్య సలహాదారులు పెసర కొండ రాజయ్య, ధోనిపెల్లి లింగయ్య, కొండ పవన్, ధోనిపెల్లి శరన్, సూరిమల్ల రామచంద్ర, ఆర్ల రమేష్, వెంకటేష్, మాల సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మందమర్రి ఏరియాలో 89 శాతం బొగ్గు ఉత్పత్తి



నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి ఏరియాలో 89 శాతం బొగ్గు ఉత్పత్తి చేసినట్టు ఏరియా జీఎం మనోహర్ వెల్లడించారు. మందమర్రి జీఎం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జీఎం మనోహర్ మాట్లాడుతూ డిసెంబర్ మాసంలో సాధించిన ఉత్పత్తి ఉత్పాధకత వివరాలు వెల్లడించారు. ఉపరితల గనుల్లో ఆర్కే ఓసి 118 శాతం, కెకె-5 111 శాతం ఉత్పత్తి సాధించడం అభినందనీయమని, ముందంజలో నిలిపిన కార్మికులు ఉద్యోగులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కెకె ఓసి 93 శాతం, కాసిపేట 41 శాతం, కాసిపేట-2 34 శాతం, శాంతిఖని 20 శాతంతో ఏరియా మొత్తంగా 89 శాతం బొగ్గుని ఉత్పత్తి చేసినట్లు జీఎం తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఎలాంటి అవరోధాలు లేకుండా 100 శాతం ఉత్పత్తి సాధించే విధంగా ముందుకు తీసుకు వెళ్లాలని కార్మికులను కోరారు. నిర్దేశించిన లక్ష్యాలను త్వరలోనే చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, డీజీఎం ఐడి రాజన్న, ఆర్కే ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, కేకే ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్, డీవైపీఎం ఎండీ ఆసిఫ్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగికి డిస్పెన్సరీ ఉద్యోగుల ఆర్థిక సాయం

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని డిస్పెన్సరీలో పని చేస్తున్న అశోక్ భార్యకు క్యాన్సర్ ఉండడంతో డిస్పెన్సరీలో పని చేస్తున్న ఉద్యోగులు అందరు కలిసి రూ.21,100 ఆర్థిక సాయాన్ని సోమవారం జీఎం సంజీవరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ తమ తోటి ఉద్యోగులకు ఆపద కాలంలో ఆదుకోవడం చాలా సంతోషకరమైన విషయమని ఇటువంటి సహాయ సహకారాలు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం రఘు కుమార్, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం పర్సనల్ పి అరవింద రావు, డీజీఎం సివిల్ ఆనంద్ కుమార్, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర రెడ్డి, డాక్టర్లు వేదవ్యాస్, లోకనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోన తపాలపూర్ గ్రామంలో జెల్లా భీమయ్య అనే వ్యక్తి ఇంటి గేటును ఆ కారణంగా పగలగొట్టిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై బిక్కులాల్ తెలిపారు. గేటును పగులగొట్టి కుటుంభ సభ్యులను దూషించిన నల్ల విజయ్ కుమార్, నల్ల వినయ్ కుమార్, నల్ల కవిత, సింగరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రెడ్డి సరళ, సురేఖ అనే ఆరు గురు వ్యక్తులపై బాదితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

సింగేణి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపిన జీఎం

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న సింగరేణి ఉద్యోగులకు, యూనియన్ నాయకులకు, వారి కుటుంబ సభ్యులకు ఏరియా జీఎం సంజీవరెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జీఎం కార్యాలయం, శ్రీరాంపూర్ ఉపరితల గని, ఆర్కే-8 డిస్పెన్సరీలలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థలు శ్రీరాంపూర్ ఏరియా అత్యంత కీలకమైనదని శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ రక్షణతో పని చేయాలని సాధించవలసిన ఉత్పత్తి లక్ష్యాలను ఎల్లవేళలా గుర్తు పెట్టుకుని ఈ ఆర్థిక సంవత్సర నిర్దేశిత లక్ష్యసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే జీఎం కార్యాలయంలో లక్కీ డ్రాలో గెలుపొందిన ఉద్యోగులకు జీఎం బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం రఘు కుమార్, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్టు ఆఫీసర్ వి పురుషోత్తమరెడ్డి, డీజీఎం పర్సనల్ పి.అరవిందరావు, డీజీఎం సివిల్ ఆనంద్ కుమార్, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్ రావు, డీవై సీఎంఓ డాక్టర్ పి.రమేష్ బాబు, శ్రీరాంపూర్ ఉపరితల గని మేనేజర్ సుధీర్, శ్రీరాంపూర్ ఉపరితల గని రక్షణా అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలి

కాగజ్‌నగర్ రూరల్ : పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకంలో భాగంగా నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. సోమవారం నవోదయలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 30 మంది విద్యార్థినులకు మూడు నెలలపాటు డేటా ఎంట్రీ ఆపరేషన్‌లో శిక్షణ ఇస్తారని తెలిపారు. పరీక్ష నిర్వహించి వారి నైపుణ్యాభివృద్ధి పరీక్షించి వాళ్లకు గుర్తింపు పత్రం అందజేస్తారన్నారు. సర్టిఫికెట్ ఆధారంగా వివిధ కంపెనీల్లో ఉపాధి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థినులు అవకాశాన్ని వినియోగించుకుని తగిన శిక్షణ పొంది ఉపాధి అవకాశాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ చక్రపాణి, కోర్స్ కోఆర్డినేటర్ ఎస్.అనిల్, సీనియర్ ఉపాధ్యాయులు డా. రామయ్య పాల్గొన్నారు.

రాములోరి అక్షింతల ఊరేగింపు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పొనకల్ గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీలంక కాలనీవాసులు అయోధ్య రాములోరి పూజిత అక్షింతలను సోమవారం శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం కరపత్రాలు పంచుతూ అక్షింతలు ఇంటింటికీ పంచుతూ వీధులలో శోభయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీలంక కాలనీవాసులు, మహిళలు, గ్రామ భక్తులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి కుండా భాజా భజంత్రీలతో శోభ యాత్ర నిర్వహించారు. జన్నారం, పొంగల్ శ్రీలంక కాలనీలు శ్రీరామ నామస్మరణతో మార్మోగాయి.